సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 23 । డిసెంబర్ । 2023



మళ్లీ మహమ్మారి అలజడి..!

కరోనా మహమ్మారి మళ్లీ అలజడి సృష్టిస్తోంది. కేరళలో కేసులు నమోదుకావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. - 8లో



సేవా లోపాలకు కూడా పరిహారం

వస్తువుల కొనుగోలులోనే కాకుండా సేవా లోపాలకు కూడా పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు. - 8లో



వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ట్రాయ్

టెలికాం వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ట్రాయ్ పనిచేస్తోందని బీజీపీఏ సలహాదారు ఎస్.కె.శర్మ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే దాతృత్వం



వృద్ధురాలికి రగ్గుకప్పుతున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని వాబ గ్రామంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేశారు. ఏజెన్సీలో ఉష్ణోగ్రత తగ్గడం, చలి ప్రభావంతో ఓ ఇంటి ఆరుబయట ఉన్న వృద్ధురాలు వణికిపోతూ ఇబ్బందులు పడడాన్ని ఎమ్మెల్యే గుర్తించారు. వెంటనే తన వాహనంలో ఉన్న నూతన రగ్గును తెప్పించి వృద్ధురాలికి కప్పారు. చలికాలంలో బయటకు రావద్దని, ఇంట్లో ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే దాతృత్వానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కంది కొత్తల పండగ



ఇరిడి గ్రామంలో కప్పరమ్మ కొండ దేవతకు పూజలు చేస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: ఏటా డిసెంబర్ నెలాఖరులో గిరిజనులు నిర్వహించే కందికొత్తల పండగ డప్పు మన్యంలో శుక్రవారం మోగింది. మండలంలోని ఇరిడి, తాడికొండ, కొత్తగూడ, దర్భిని, తోలుఖర్జ గ్రామాల్లోని గిరిజనులు గ్రామ దేవతలకు పూజలు చేశారు. పసుపు, కుంకుమలు సమర్పించారు. చేతికందిన కంది పంటను నైవేద్యంగా సమర్పించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. వారంరోజులపాటు కంది కొత్తల ఉత్సవాలు సాగుతాయని గిరిజనులు తెలిపారు.

శంబాం ఆశ్రమపాఠశాల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: మండలంలోని శంబాం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమపాఠశాలను డిప్యూటీఈఓ ఎ.లిల్లీరాణి శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. లెస్సన్‌ప్లాన్‌లు, టీచింగ్ డైరీ, రికార్డులు చూశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఉపాధ్యాయుల బోధనతీరుపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మెనూ పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుందరరావు పాల్గొన్నారు.

రూ.20 లక్షల చెక్కు అందజేత



ప్రమాద బీమా చెక్కును వంశీకు అందజేస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ జితేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు (భద్రగిరి శాఖ) నుంచి ప్రమాదబీమా కింద మంజూరైన రూ.20 లక్షల చెక్కును మేనేజర్ జితేంద్రకుమార్ బాధిత మహిళ కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఏపీజీవీబీ ఖాతాదారు పాలక లలిత (వలస బల్లేరు గ్రామం) రూ.1000ల వార్షిక ప్రీమియంతో ప్రమాద బీమాను కట్టిందని, దురదృష్టవసాత్తు ప్రమాదానికి గురై మరణించడంతో ఆమె పేరున మంజూరైన రూ.20 లక్షల నగదును నామినీ అయిన పాలక వంశీకు అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు, అకౌంటెంట్ భాస్కరరావు, క్యాషియర్ శ్రీనివాష్, నోడల్ ఆఫీసర్ జుత్తాడ వాసు, ఎస్‌బీఐ జనరల్ టీమ్ వినీల్, గుమ్మలక్ష్మీపురం బ్యాంకు మిత్రలు పట్నాయకుని చైతన్య, ప్రదీప్, దమయంతి పాల్గొన్నారు.

పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల్లో..

విద్యావెలుగులు



పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదుతున్న విద్యార్థులు

- చదువుకు ఆర్థికసాయం చేస్తున్న ప్రభుత్వం
- అవకాశాల కల్పన
- ఉన్నత చదువులకు ప్రోత్సాహకాలు
- క్రమం తప్పకుండా జగనన్న విద్యా, వసతి దీవెన
- డిజిటల్ విద్యను ప్రోత్సహించేలా బడుల్లో మార్పులు
- విద్యార్థుల చేతికి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు
- విద్యాదీవెన కింద 86,048 మందికి రూ.131.66 కోట్ల ప్రయోజనం
- వసతిదీవెన కింద 73,015 మందికి రూ.68.99కోట్ల లబ్ధి
- అర్హతే కొలమానంగా పథకాలు అమలు

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత చదువుకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది. చదువుకునేందుకు ఆహ్లాదకరమైన పరిసరాలు, అవకాశాలను సృష్టిస్తోంది. బతుకులు బాగుపడేలా ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత చదువుల వరకు అండగా ఉంటోంది. నాలుగున్నరేళ్లుగా ఠంచన్‌గా అందిస్తున్న జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలు బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, డిప్లమో, ఎంబీబీఎస్ వంటి కోర్సులు చదివే ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, బీసీ, అగ్రవర్ణ పేద విద్యార్థులకు ఆర్థిక కష్టాలు దూరమయ్యాయి. నిరాంటంకంగా చదువుకునేందుకు అవకాశం కలిగింది. పిల్లల చదువుకు అవసరమయ్యే డబ్బులకోసం తల్లిదండ్రులు వెంపర్లాడాల్సిన అవసరం తప్పింది. విద్యార్థి ప్రయోజకుడయ్యేవరకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటునందించడంతో పాటు అవకాశాలను కల్పిస్తుండడంతో విద్యార్థుల జీవితాల్లో కొత్తకాంతి కనిపిస్తోంది. ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చుతూ.. ఉన్నత శిఖరాలు అందుకోవాలన్న దృక్పథం విద్యార్థుల్లో రోజురోజుకూ పెరుగుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చదువు బెంగలేదన్న ధీమా అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రుల్లో కన్పిస్తోంది.

ఇచ్చిన మాట ప్రకారం..

పేద విద్యార్థుల చదువుకు ఎంత ఖర్చు అయినా భరిస్తామని ఆనాడు ప్రజాసంకల్పయాత్రలో ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత, విదేశీ విద్య అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక కష్టాలు దూరం చేసేలా వివిధ సంక్షేమ పథకాలను అందుబాటులోకి తెచ్చారు. చదువుకు ఠంచన్‌గా సాయం అందిస్తున్నారు. ప్రతి పైసాను విద్యార్థుల తల్లులు, సంరక్షకుల ఖాతాలకు జమచేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 2019-23 సంవత్సరాల మధ్య మొత్తం నాలుగు విడతల్లో విద్యాదీవెన పథకం కింద 86,048 లబ్ధిదారుల ఖాతాల్లో రూ.131.66 కోట్లు, వసతిదీవెన పథకం కింద 73,015 మంది లబ్ధిదారులకు రూ.68.99కోట్లు చెల్లించారు.



జగనన్న విద్యాదీవెన చెక్కును అందిస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాలో విద్యాదీవెన లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	17,824	రూ.34.67
2020-21	21,926	రూ.31.89
2021-22	22,992	రూ.41.68
2022-23	20,306	రూ.23.42

జిల్లాలో వసతిదీవెన లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	16,091	రూ.15.51
2020-21	19,547	రూ.18.87
2021-22	20,205	రూ. 18.77
2022-23	17,172	రూ.15.84

ఎంతో ఉపయోగకరం



డిగ్రీ విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన కింద అందిస్తున్న సాయం ఎంతో ఉపయోగకరం. తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించింది. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి జగనన్న గట్టిగా నమ్ముతున్నారు. ఆయన ఆశయాన్ని నెరవేర్చుతాం. చక్కగా చదువుకుని ప్రయోజకులుగా ఎదుగుతాం.

– తిమ్మక స్వాతి, డిగ్రీ విద్యార్థి, సోషల్ వెల్ఫేర్ వసతిగృహం, పార్వతీపురం

భరోసా దొరికింది



మాది పేద కుటుంబం. ఉన్నత చదువులు చదువుకోలేన్న బెంగ ఉండేది. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను అమలుచేయడంతో చదువుకు ఆర్థిక భరోసా దొరికింది. గతంలో మాలాంటి పేదవిద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ఎలా చదివించాలని మదనపడేవారు. సీఎంగా జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. పేదకుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చారు. ఆర్థిక కష్టాలు లేకుండా చేశారు. ఆయనకు జీవితాంతం రుణ ఉంటాం.

– పి.సతీష్, డిగ్రీ విద్యార్థి, నిడగల్లు, పార్వతీపురం మండలం

చదువుకు ఆర్థిక సాయం



ప్రభుత్వం పేద విద్యార్థులకు అందజేస్తున్న వసతి, విద్య దీవెన పథకాలు చదువుకు ఎంతో ఉపయోగపడతాయి. అర్హులందరినీ ఎంపిక చేసి ప్రభుత్వానికి క్రమం తప్పకుండా నివేదికలు అందజేస్తున్నాం. ఫలితంగా ప్రతి ఒక్కరికీ ఈ పథకాల కింద లబ్ధి చేకూరుతుంది. విద్యార్థుల ఉన్నత చదువుకు ఈ పథకాలు ఉపయోగపడడమే కాకుండా వారికి ఆర్థిక భరోసా కలుగుతుంది. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా విద్యార్థులకు చదవాలనే ఆసక్తి మరింత పెరుగుతుంది.

– మహ్మద్ గయాజుద్దీన్, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి, పార్వతీపురం మన్యం

● మేథ్స్ డే



శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో గణిత దినోత్సవాన్ని శుక్రవారం వేడుకగా నిర్వహించారు. గణిత ప్రాజెక్టులను ప్రదర్శించారు. శ్రీనివాస రామానుజన్ గొప్పతనాన్ని, గణితంలో ఆయన చూపిన ప్రతిభను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల విద్యార్థులు రామానుజన్ ఇష్టసంఖ్య 1729 ఆకారంలో ఏర్పడి గణితం గొప్పతనాన్ని తెలియజేశారు.

– జియ్యమ్మవలస

గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం



రిబ్బన్ కట్ చేసి, వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- భీంపురం వంతెన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: గిరిజనులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఒబ్బంగి పంచాయతీ, భీంపురం వద్ద కొత్తగా రూ.80లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనను ఆమె శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి అన్ని ప్రాంతాలు బాగుండడంతో పాటు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంత దూరమైనా వెళ్తారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఇదే వంతెన నిర్మాణం కోసం గిరిజనులు ఎంతగానో మొరపెట్టుకున్నా, చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. అప్పట్లోనే ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, మన పార్టీ అధికారంలోకి రాగానే వంతెన నిర్మాణం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చానన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వంతో మాట్లాడి, ఇప్పుడు వంతెన నిర్మాణం జరిగేలా చేశామన్నారు. ఈ వంతెనతో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని 180 గ్రామాల గిరిజనులకు ప్రయోజనమన్నారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ జి.సుజాత, వైస్ ఎంపీపీలు బి. అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీలు రాజేశ్వరి, విద్యారాణి, కృష్ణకుమారి, పార్టీ మండల కన్వీనర్ ఐ.గౌరీశంకరరావు, స్టేట్ ఫైనాన్స్, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు ఎ.ఇందిరాకుమారి, జి.విజయ్, వైఎస్సార్ సీపీ కార్యదర్శి ఎన్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో ప్రవేశం

సీతంపేట: ఐటీఐలో 60 శాతం మార్కులతో పాసైన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు పొందవచ్చని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐటీఐలో భౌతికశాస్త్రం, రసాయన, గణిత శాస్త్రాల్లో ఉచిత బ్రిడ్జి కోర్సును నిర్వహిస్తామన్నారు. వచ్చేఏడాది ఫిబ్రవరి 1 నుంచి 3 తేదీల వరకు ప్రాక్టికల్స్ జరుగుతాయని తెలిపారు. పూర్తివివరాలకు ఈ నెల 31వ తేదీలోగా ఐటీఐ ప్రిన్సిపాల్, ఫోన్: 94911 34464 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కోవిడ్ నియంత్రణకు అప్రమత్తతే ఆయుధం

పాలకొండ రూరల్: కోవిడ్ నియంత్రణకు అప్రమత్తతే ఆయుధమని పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు అన్నారు. కోవిడ్ కేసులు బయటపడుతున్న క్రమంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక వైద్య యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇందులో భాగంగా ఆస్పత్రి సిబ్బందితో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కోవిడ్ పాజిటివ్ బాధితులు చికిత్సన కోసం వస్తే పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. భౌతిక దూరం పాటించడంతో పాటు చేతుల శుభ్రత, మాస్కులు ధరించడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహార పదార్థాలను ఆరగించాలన్నారు. పిల్లలు, వృద్ధుల విషయంతో జాగ్రత్తలు పాటించాలన్నారు. జలుబు, జ్వరం తదితర కోవిడ్ లక్షణాలు శరీరంలో గుర్తిస్తే వెంటనే నియమాలను పాటిస్తూ వైద్యలను సంప్రదించాలని కోరారు.



ఏరియా ఆస్పత్రిలో కోవిడ్‌పై ప్రత్యేక మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సంబరంగా సైనిక్ స్కూల్ వార్షికోత్సవం

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలి: విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కె.జి.కృష్ణ

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం సంబరంగా సాగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల పూర్వవిద్యార్థి, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కె.జి.కృష్ణ హాజరయ్యారు. పాఠశాల ఆవరణలోని అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం అయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని అత్యున్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. క్రమశిక్షణతో రాణించి పాఠశాల పేరు ప్రఖ్యాతులను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేయాలని పిలుపునిచ్చారు. క్రీడలు, విద్య, ఇతర రంగాల్లో రాణిస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. సైనిక పాఠశాల విద్యార్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో చేరడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. పాఠశాలలో విద్యనభ్యశించి ఉన్నత శిఖరాలకు చేరుకున్న పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, ప్రశాంత వాతావరణం, సుందరమైన క్రీడా మైదానాలు, ఉత్తమ ఉపాధ్యాయులు లభించడం విద్యార్థుల అదృష్టమన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సైనిక పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం పాఠశాల అథ్లెటిక్ మీట్, విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, షీల్డ్‌లను అందజేశారు. సైనిక పాఠశాల అభివృద్ధి, విద్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రిన్సిపాల్, గ్రూప్‌కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి ఆయనకు వివరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సాహస క్రీడలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవన్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కె.జి.కృష్ణ

17,505 గిరిజన గృహాలకు..

ఉచిత విద్యుత్ మీటర్లు

- ఈ నెల 24 నాటికి సర్వే పూర్తి
- గ్రామీణ ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం
- ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్టులు) సూర్యప్రతాప్

సీతంపేట: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న ఐదు ఉమ్మడి జిల్లాల్లోని 3,761 గిరిజన గ్రామాల్లో 17,505 గృహాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆ శాఖ డైరెక్టర్ (ప్రాజెక్టులు) ఏవీవీ సూర్యప్రతాప్ తెలిపారు. విద్యుత్ కనెక్షన్లపై సీతంపేట ఏజెన్సీలో జరుగుతున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాల్లోని ఏజెన్సీలో పీవీటీజీ గిరిజనులకు ఎన్ని కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు లేవనేదానిపై సర్వేచేస్తున్నామన్నారు. ఈ నెల 24 నాటికి సర్వే పూర్తవుతుందని చెప్పారు. ఆ తర్వాత ఉచిత విద్యుత్ మీటర్లు ఇచ్చి ప్రతీ ఇంటికి విద్యుత్ సదుపాయం కల్పిస్తామని స్పష్టంచేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 2,095 హేబిటేషన్లలో 13,600ల గృహాలకు విద్యుత్ సదుపాయం లేదని అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి నివేదికలు అందాయన్నారు. విజయనగరం జిల్లాలో 553 హేబిటేషన్లకు 1367, ఏలూరులో 95 గ్రామాల్లో 409, తూర్పుగోదావరి జిల్లాలో 625 గ్రామాలకు 4013 కుటుంబాలకు విద్యుత్ మీటర్లు లేవన్నారు. అలాగే, శ్రీకాకుళంలో 451 హేబిటేషన్లకు 1468 ఇళ్లకు విద్యుత్ సదుపాయం లేదన్నారు. వీటన్నింటికీ యుద్ధప్రాతిపదికన ఉచిత కనెక్షన్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇకపై 24 గంటలూ విద్యుత్ సరఫరాకు వీలుగా త్రీఫేజ్ సప్లై త్వరలో ఇస్తామన్నారు. పట్టణాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ దశలవారీగా 18 నెలల్లో పూర్తిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి, ఏఈ నీలిమ, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ సూర్యప్రతాప్

పుణ్యప్రదం.. గిరి ప్రదక్షిణ

- రామతీర్థంలో గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి
- ఉత్తరద్వారం గుండా దర్శనమివ్వనున్న రాములోరు
- ముక్కోటి ఏకాదశి పూజలకు సిద్ధమైన రామక్షేత్రం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం శనివారం నిర్వహించే ముక్కోటి ఏకాదశి పూజలకు ముస్తాబైంది. మెట్లోత్సవంతో పాటు, స్వామివారి ఉత్తర ద్వారదర్శనం, గిరి ప్రదక్షిణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి విశిష్టమైనది. భక్తులు శ్రీ కోదండ రామస్వామివారి బోడికొండ చుట్టూ మొత్తం 8 కిలోమీటర్ల మేర రామనామాన్ని జపిస్తూ ప్రదక్షిణ చేస్తారు. అనంతరం బోడికొండపై ఉన్న కోదండ రాముడికి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు. స్వామివారిని ఎంత పవిత్రంగా పూజిస్తారో.. గిరి (పర్వతాన్ని) కూడా భక్తులు అంతే పవిత్రంగా భావిస్తారు. ఎంతో మంది రుషులు తపస్సు చేసి స్వామివారి అనుగ్రహం పొంది అదే పర్వతంపై వృక్షాలు, శిలలుగా మారిపోయారని భక్తులు విశ్వసిస్తారు. అటువంటి గొప్ప పర్వతం చుట్టూ ప్రదక్షణలు చేస్తే పుణ్యం లభిస్తుందనేది భక్తుల నమ్మకం. రామనామస్మరణతో పర్వతం చుట్టూ గిరిప్రదక్షణ చేయడం వల్ల ఆ ప్రాంతమంతా పునీతమవుతుందని అర్చకులు చెబుతున్నారు. ఒకసారి గిరిచుట్టూ ప్రదక్షణ చేస్తే భూమండలం చుట్టూ ప్రదక్షణ చేసినంత పుణ్యఫలం లభిస్తుందని ప్రతీతి. పాండవులు నడయాడిన నేల కావడంతో గిరి పర్వతం చుట్టూ నడిచేందుకు భక్తజనం ఉవ్విళ్లూరుతోంది.



రామతీర్థం ఉత్తర రాజగోపురం



బోడికొండ కోదండ రామాలయ మెట్లు

ఉత్తర రాజగోపురం నుంచి ...

వేకువజామున 3 గంటలకు స్వామివారికి ఆరాధన, 4 గంటలకు తిరుప్పావై సేవా కాలం, మంగళాశాసనం, తీర్థగోష్టి పూర్తయిన తర్వాత మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణ నడుమ తెల్లవారు జామున 5 గంటలకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులకు అవకాశం కల్పిస్తారు. ఉదయం 7.30 గంటల వరకు స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు అవకాశం ఉంటుంది. అనంతరం స్వామివారి గ్రామతిరువీధి ఉత్సవాన్ని జరిపించి ఉదయం 8 గంటలకు భజన, కోలాటం, కీర్తన బృందాలతో బోడికొండ మెట్ల వద్దకు వెళ్లి పసుపు, కుంకుమలతో పూజిస్తారు. మెట్లోత్సవం, గోపూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం నీలాచల బోడికొండ చుట్టూ గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తారు.

మళ్లీ మహమ్మారి అలజడి..!

- కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- పీహెచ్‌సీలో టెస్టింగ్ కిట్లు సిద్ధం చేసిన అధికారులు
- అందుబాటులో 6800 ఆర్‌టీపీసీఆర్
- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 30 పడకల వార్డు
- కోవిడ్ లక్షణాలుంటే పరీక్షలు


కోవిడ్ పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కోవిడ్ వార్డు

విజయనగరం ఫోర్ట్: కరోనా (కోవిడ్) మహమ్మారి కేరళ, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రారంభించారు. రెండేళ్ల క్రితం యావత్ ప్రపంచాన్ని కరోనా మహమ్మారి వణికించింది. కోవిడ్ బారిన పడి ఎంతో మత్యువాత పడ్డారు. మరికొంత మంది కోవిడ్‌ను జయించి బతికిబట్టకట్టారు. కోవిడ్ బారిన పడి ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలు ఛిన్నాభిన్నమయ్యాయి. మొదటి, రెండో దశ కోవిడ్ ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మూడో విడత కోవిడ్ వచ్చినప్పటికీ వ్యాక్సిన్ పూర్తికావడం వల్ల అంతగా ప్రభావం చూపలేదు. తాజాగా కరోనా జేఎన్1 వేరియంట్ వ్యాప్తి దేశంలో మొదలైంది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

కొత్త వేరియంట్ లక్షణాలు

- జలుబు, దగ్గు, ముక్కు నుంచి కారడం
- తీవ్రమైన జ్వరం, వాంతులవడం
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- తీవ్రమైన అలసట
- ఛాతీలో నొప్పి, వణుకు, వాసన గుర్తించలేక పోవడం
- తీవ్రమైన న్యూమోనియాతో ఊపిరితిత్తుల్లో సమస్యలు
- ఒళ్లు నొప్పులు, కొత్త వేరియంట్ పునరుత్పత్తి సామర్థ్యం ఎక్కువ ఎక్కువగా విస్తరించే ఆస్కారం ఉంది. ఇది గతంలో కోవిడ్ ఇన్‌ఫెక్షన్ ఉన్న వ్యక్తులకు, టీకాలు వేసిన వ్యక్తులకు కూడా సోకుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

దగ్గు, తుమ్ములు, ముక్కు నుంచి కారణం వంటి లక్షణాలు ఉన్న వారికి దూరంగా ఉండాలి.

- మాస్కులు ధరించాలి
- జనసందోహ ప్రాంతాల్లో సంచరించరాదు
- చేతులను తరచూ సబ్బునీటితో కడుక్కోవాలి
- చలి ప్రదేశాల్లో తిరగరాదు
- సాధ్యమైనంతవరకు దూర ప్రాంతాలకు ప్రయాణం వాయిదా వేసుకోవాలి
- దగ్గు, జలుబు, ఛాతీలో నొప్పి తదితర లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో టెస్టు చేయించుకోవాలి.

పీహెచ్‌సీల్లో పరీక్షలకు ఏర్పాట్లు

కోవిడ్ లక్షణాలున్న వారికి పరీక్షలు చేసేందుకు వైద్యారోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పీహెచ్‌సీల్లో ఆర్‌టీపీసీఆర్‌సీ, ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉంచారు. ఆర్‌టీపీసీఆర్ కిట్లు 6800, రాపిడ్ టెస్టింగ్ కిట్లు 920 పీహెచ్‌సీల్లో ఉంచారు. అదేవిధంగా అవసరమైన వారికి ఆస్పత్రిలో చికిత్స అందించేందుకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 30 పడకల వార్డును ఏర్పాటు చేశారు.

జాగ్రత్తలు పాటించాలి

పాజిటివ్ వచ్చిన వారు హోంఐసోలేషన్ ఉండి విశ్రాంతి తీసుకోవాలి. ఆస్పత్రిలో చికిత్స అవసరం అనుకుంటే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాలి. శబరిమలై వెళ్లే భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్కులు, శానిటైజర్లు, జ్వరం మాత్రలు వెంట ఉంచుకోవాలి. మరీ ఇబ్బంది అనిపిస్తే ప్రయాణం వాయిదా వేసుకోవాలి. చలికాలంలో వ్యాధి వ్యాప్తి అధికంగా ఉంటుంది కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జనసంచారం ఎక్కువగా ఉన్న చోటకు వెళ్లకూడదు. మాస్క్ ధరించడం, భౌతికదూరం పాటించడం మంచిది.

డాక్టర్ ఎస్.భాస్కరరావు,
డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

మండల పరిషత్ వార్షిక తనిఖీ


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కె రాజ్‌కుమార్

సీతానగరం: జిల్లావ్యాప్తంగా ఈనెల 26 నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కె.రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయం వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతానగరం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో జనరల్ ఫండ్ కేటాయింపు, వినియోగం పరిశీలించినట్లు తెలిపారు. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులఖర్చు, అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కోసం కేటాయించిన నిధులు, ఖర్చులవివరాలు తనిఖీ చేసినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని 34 మండలాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 కోట్లు సిద్ధంగా ఉన్నాయని తక్షణమే ఖర్చు చేయాలని కోరారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే జనవరి 2 నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, మండల ఇంజినీరింగ్ అధికారి గంట చంద్రమౌళి, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో అవార్డు స్వీకరిస్తున్న బి.కీర్తిక

గుమ్మలక్ష్మీపురం: జాతీయ వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో శుక్రవారం వినియోగదారుల హక్కులు–చట్టాలు అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, డిబేట్ పోటీల్లో గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి బి.కీర్తిక ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికనట్లు హెచ్‌ఎం బిడ్డిక భీముడు తెలిపారు. ఈ మేరకు విజయవాడలో శనివారం జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు కీర్తిక వె వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఆ పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభకనబర్చాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలకు కీర్తిక ఎంపిక కావడం పట్ల గుమ్మలక్ష్మీపురం వినియోగదారుల సమాచారం కేంద్రం నిర్వాహకురాలు పి.నాగమణి తదితరులు అభినందించారు.

అభినందనలు


అజయ్‌ను అభినందిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, ఎస్సైలు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సనపల అజయ్‌కుమార్ ఇటీవల విడుదలైన ఎస్సై ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో జోన్‌- 1 ఎస్సైగా ఎంపికయ్యాడు. దీంతో స్టేషన్ ఆవరణలో సీఐ బి.వెంకటరావు ఆధ్వర్యంలో సహచర సిబ్బంది అజయ్‌ను శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, అజయ్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అజయ్ తండ్రి ఎక్సైజ్ శాఖలో హెచ్‌సీగా పనిచేసి రిటైరయ్యారు. కార్యక్రమంలో ఎస్సైలు అశోక్, గణేష్, మురళి, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సేవా లోపాలకు కూడా పరిహారం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ ఆర్. వెంకట నాగసుందర్

పార్వతీపురం: వస్తువుల కొనుగోలులోనే కాకుండా సేవా లోపాలకు కూడా పరిష్కారం పొందవచ్చుని విజయనగరం జిల్లా కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ ఆర్.వెంకట నాగసుందర్ స్పష్టం చేశారు. 27వ తేదీన జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల కమిషన్ ద్వారా పూర్తి ఉచితంగా సేవలు పొందవచ్చునన్నారు. వస్తువులే కాకుండా ఆస్పత్రులు, రవాణాశాఖ, రైల్వే తదితర విభాగాల ద్వారా పొందిన సేవలు కూడా వినియోగదారుల ఫోరం పరిధిలోకి వస్తాయన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్. శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో నవంబర్ 22నుంచి డిసెంబర్ 8 వరకు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. సమాజంలో ప్రతి వ్యక్తి వినియోగదారుడేనని, నాణ్యమైన, సరైన పరిమాణంలో సరైన ధరలకు వస్తువులు పొందే హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో ఫుడ్‌సేఫ్టీ అధికారి వై.రామయ్య, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి శేఖర్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కె. రత్నంరాజు, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు, మహిళా వినియోగదారుల సంఘం అధ్యక్షురాలు లావణ్య దీప్తి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వీఆర్‌ఓ మృతి


వీఆర్‌ఓ రాజారావు (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని ఎం.రాజపురం జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీఆర్‌ఓ యలగాడ రాజారావు(51) శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన భార్య అనసూయ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.వి.రమణ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. రాజారావు చిదిమి సచివాలయంలో వీఆర్‌ఓగా పనిచేసేవారు. ఆయన మృతి పట్ల తహసీల్దార్ చందక సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. ప్రభుత్వ పరంగా రాజారావు కుటుంబానికి అండగా ఉంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి..


విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన సూరినాయుడు

మెరకముడిదాం: మండలంలోని యాడిక గ్రామానికి చెందిన రెల్లి సూరినాయుడు (54) శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రెల్లిసూరినాయుడు తన పొలంలో జొన్నచేనుకు నీరు కట్టేందుకు వెళ్లి మోటార్ ఆన్ చేశాడు. అయితే మోటార్ పనిచేయకపోవడంతో ఫ్యూజ్ పోయినట్లు ఉందని భావించి ఫ్యూజ్ తీసి చూసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు భోరున విలపించారు. మృతుడి భార్య తవిటమ్మ ఫిర్యాదు మేరకు బుదరాయవలస హెడ్‌కానిస్టేబుల్ అంజిబాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి

విజయనగరం టౌన్: ఫూల్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మీగణపతి కాలనీలో వేంచేసిన వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించిన పంచరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు, స్వామి ఉపాసకుడు కర్రి వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో స్వామివారికి వేదమంత్రాల నడుమ భక్తుల సమక్షంలో కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బేతా కృష్ణారావు, కార్యదర్శి శ్రీనివాస గోపాలకృష్ణ, దువ్వు శ్రీనివాసరావు, బెహరా కూర్మారావు, దేవాలయ అర్చకుడు శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు, జరిమానా

పాలకొండ రూరల్: చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయికి పాలకొండ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విజయ రాజ్‌కుమార్ ఏడాది జైలు శిక్ష, రూ.3లక్షల జరిమానా విధించినట్లు పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖకు చెందిన చిన్నవాడు పాటకొండ పట్టణానికి చెందిన పొట్నూరు లక్ష్మణరావుకు ఇచ్చిన చెక్‌బౌన్స్ కావడంతో ఆయన ఫిర్యాదు చేశాడు. ఈ కేసు విచారణ పూర్తి కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెలువరించినట్లు స్పష్టం చేశారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

- జేసీ గోవిందరావు


మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లా రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని జేసీ గోవిందరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పాచిపెంట తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు 800 మంది రైతుల నుంచి 80 కొనుగోలు కేంద్రాల్లో సుమారు 47 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటూ ధాన్యం కొనుగోలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం మండల కేంద్రంలో జెడ్పీ హెచ్ పాఠశాలను ఆయన తనిఖీ చేసి ఉపాధ్యాయులు,విద్యార్థులతో మాట్లాడారు.పదవ తరగతి ఫలితాల్లో ఉత్త మ ఫలితాలు సా ధించేలా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రణాళికాబద్ధంగా చదవాల ని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్,ఎఈఓ జోగారావు తదితరులు ఉన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత


బాధితుడు ప్రసాద్‌కు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై షణ్ముఖరావు

కురుపాం: మండల కేంద్రానికి చెందిన వెల్లంకి ప్రసాద్ సెల్‌ఫోన్ పోగొట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై షణ్ముఖరావు దర్యాప్తు చేసి నిందితుడి దగ్గర ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు పోగొట్టుకున్న సుమారు రూ.24 వేల విలువ గల సెల్ ఫోన్ నెల్లిమర్ల సమీపంలో ఒక వ్యక్తి వద్ద ఉన్నట్లు గుర్తించి సిబ్బందిని పంపించి రికవరీ చేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు ప్రసాద్‌కు శుక్రవారం అప్పగించారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ట్రాయ్

- విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని లక్ష్యాలు సాధించాలి
- ట్రాయ్ (బీబీఅండ్ పీఏ) సలహాదారు సంజీవ్‌కుమార్‌శర్మ


సంజీవ్‌కుమార్‌శర్మను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రామారెడ్డి, తదితరులు

డెంకాడ: టెలికాం వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ట్రాయ్ నిత్యం పని చేస్తోందని ఢిల్లీకి చెందిన ట్రాయ్ (బీబీ అండ్ పీఏ) సలహాదారు సంజీవ్‌కుమార్‌శర్మ అన్నారు. జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ట్రాయ్ ఆధ్వర్యంలో 5జీ సాంకేతికతపై అవగాహన, జిల్లాలోని టెలికాం వినియోగదారుల హక్కులు, అధికారాలపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెలికాం వినియోగదారుల ప్రయోజనాలు పరిరక్షించడం, సాధికారత కల్పించడం, భారతదేశంలో నిబంధనలు రూపొందించడం, వాటిని అమలు చేయడంలో ట్రాయ్ పాత్రను వివరించారు. 5జీ నెట్‌వర్క్‌ల తదుపరి పరిశోధన, ప్రభావాలను కలిగిఉండటానికి , మెరుగైన నిబంధనలు అభివృద్ధి చేయడానికి ట్రాయ్ 5జీ ల్యాబ్‌ను అభివృద్ధి చేసిందని తెలిపారు. 6జీ టెక్నాలజీపై ఇప్పుడే పరిశోధనలు ప్రారంభమయ్యాయని చెప్పారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సరైన రీతిలో వినియోగించుకోవాలని హైదరాబాద్ నుంచి విచ్చేసిన ఇండియన్ టెలికమ్యూనికేషన్ సర్వీసెస్ ప్రాంతీయ కార్యాలయ సలహాదారు బి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. అలాగే టెలికాం వినియోగదారుల రక్షణకు తీసుకున్న చర్యలు వివరించారు. విస్, ఐటీఎస్ జాయింట్ అడ్వయిజర్ రాజు మాట్లాడుతూ.. ఫిర్యాదులను పరిష్కరించే విధానం, వాల్యూ యాడెడ్ సర్వీస్ వాటికి సంబంధించి ట్రాయ్ తీసుకున్న చర్యలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథి సంజీవ్‌కుమార్ శర్మను లెండిక కళాశాల ప్రిన్సిపాల్ వీవీ రామారెడ్డి, ఈసీఈ విభాగాధిపతి ఎం.రాజన్‌బాబు సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ డాట్ డైరెక్టర్ జీవీ మనోజ్‌కుమార్, విజయనగరం సైబర్‌క్రైమ్ సెల్ సీఐ ఎం.ప్రశాంత్‌కుమార్, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ ఎం.వెంకటపతి, కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ఎం.రాజన్‌బాబు, డీన్స్ డి.సురేష్‌కుమార్, ఎస్.శ్రీధర్, ఏవీ పరాంకుశం, బి.శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వెలుగుల జ్యోతులు ప్రసరింపజేయాలి

- బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ అంజనీకుమార్


ప్రపంచ తెలుగు మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ అంజనీకుమార్, తదితరులు

విజయనగరం క్రైమ్: తెలుగు వెలుగుల జ్యోతులు ప్రతిచోటా ప్రసరింపజేయాలని బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ అంజనీకుమార్ కోరారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాలలో జనవరి 5,6,7 తేదీల్లో నిర్వహించనున్న రెండో ప్రపంచ తెలుగు మహాసభల కరపత్రాలను విజయనగరం జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు భాషా ఔన్నత్యాన్ని విరాజింపజేయాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్ర సారస్వత పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, సభ్యులు దాసరి పద్మ, రత్నాల బాలకృష్ణ, న్యాయవాదులు జి.రాంబాబు, ఎం.శ్రీనివాస్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

సాలూరు: పాచిపెంట మండలం పి.కోనవలస ఘాట్‌రోడ్డు వద్ద లారీ శుక్రవారం బోల్తా పడగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని బొరిగాం నుంచి విశాఖపట్నం పోర్టుకు బియ్యం లోడుతో వస్తున్న లారీ ఘాట్‌రోడ్డులో 3వ మైలు వద్ద బోల్తాకొట్టి లోయలో పడింది.ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వీ జ్యువెలరీ మార్ట్ ప్రారంభం


కస్టమర్లతో కళకళలాడుతున్న వీ జ్యూయలరీ మార్ట్


జ్యూయలరీ మార్ట్ ప్రారంభిస్తున్న సురేష్‌కుమార్

డాబాగార్డెన్స్ (విశాఖపట్నం): హోటల్ మేఘాలయ సమీపంలోని నవరత్న ట్రేడ్ సెంటర్ 6వ అంతస్తులో ఏర్పాటు చేసిన 'వీ జ్యువెలరీ మార్ట్'ను శుక్రవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, నవరత్నం ఎస్టేట్స్ ప్రతినిధి సురేష్‌కుమార్ జైన్ ప్రారంభించారు. వైశ్యరాజు జ్యూయలర్స్ అధినేత వైశ్యరాజు ఫల్గుణరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. మంచుకొండ శ్యామ్, నవరత్న ఎస్టేట్స్ డైరెక్టర్ మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వీ జ్యువెలరీ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ ధరకే బంగారు ఆభరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. వీవీఎస్ క్లారిటీ, ఈఎఫ్ కలర్ గల డైమండ్స్ క్యారెట్ రూ.49,900 నుంచి ప్రారంభమని, వాటిపై తరుగు, మజూరీ లేదన్నారు. జీఎస్టీ కూడా కస్టమర్ల తరఫున తామే చెల్లిస్తామన్నారు. రెగ్యులర్ వెండి వస్తువులపై కూడా తరుగు, మజూరీ లేదన్నారు. అత్యుత్తమమైన డిజైనరీ ఆభరణాలు ఫ్యాక్టరీ ధరకు ఎవరూ ఇవ్వలేరని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బ్రాంచ్ మేనేజర్ సయ్యద్ ఖాదర్ కోరారు.

చికెన్	బ్రాయిలర్	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
		₹110	₹190	₹200